ఐఎన్ఎస్ బ్రహ్మపుత్రలో మంటలు

- నావికుడు గల్లంతు
- తీవ్రంగా దెబ్బతిన్న యుద్ధ నౌక

ముంబై, జూలై 22: ముంబై నావల్ డాక్ యార్డ్‌లో మరమ్మత్తులు జరుపుకుంటున్న యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ బ్రహ్మపుత్ర'లో ఆదివారం పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. డాక్‌యార్డ్‌లో ఇతరుల సాయంతో అగ్నిమాపక సిబ్బంది కొన్ని గంటలపాటు శ్రమించి మంటల్ని అదుపులోకి తీసుకొచ్చినట్టు భారత నౌకాదళం సోమవారం తెలిపింది. ఈ ఘటనలో ఓ నావికుడు గల్లంతయ్యాడని, యుద్ధ నౌకలోని ఓ వైపు భాగం దెబ్బతిన్నదని వెల్లడించింది. గల్లంతైన నావికుడి ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు పేర్కొన్నది. యుద్ధ నౌకలో మంటలు అదుపులోకి వచ్చినా, యుద్ధనౌక నిటారుగా నిలువలేక.. ఓ వైపునకు ఒరిగిపోయింది. సిబ్బంది ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ.. యుద్ధ నౌక తిరిగి పూర్వపు స్థితికి రాలేకపోయింది. ఘటనపై భారత నౌకాదళం విచారణకు ఆదేశించింది.

నేడు కేంద్ర బడ్జెట్

న్యూఢిల్లీ, జూలై 22: 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను మంగళవారం ప్రవేశపెట్టనున్నది. దీంతో వరుసగా ఏడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన తొలి కేంద్ర ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ నిలువనున్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీ మిత్రపక్షాలపై ఆధారపడి కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఈ దఫా బడ్జెట్‌కు ప్రాధాన్యం సంతరించుకొన్నది. ఏయే కొత్త సంక్షేమ పథకాలు ప్రకటిస్తారు? మధ్యతరగతికి ఆదాయ పన్ను ఉపశమనం ఉంటుందా? జనాకర్షక స్కీమ్‌లు ఏముంటాయి? అనే అంశాలపై చర్చ నడుస్తున్నది. మూడోసారి అధికారం చేపట్టినప్పటికీ, గత రెండు పర్యాయాలతో పోలిస్తే లోక్‌సభలో బీజేపీ ఎంపీ సీట్ల సంఖ్య తగ్గిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మిత్రపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ప్రత్యేక ప్యాకేజీలు ఉంటాయా? అనేది కూడా చర్చనీయాంశంగా మారింది. మరోవైపు కొత్త పద్దులో వృద్ధికి ఊతమివ్వడమే కాకుండా ద్రవ్యోల్బణం కట్టడిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

నిర్మలకు వరుసగా ఏడో బడ్జెట్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు ఇది వరుసగా ఏడో బడ్జెట్. తద్వారా ఆరు సార్లు వరుసగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయ్ రికార్డును ఆమె అధిగమించనున్నారు. మొత్తంగా

ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం నేపథ్యంలో ప్రాధాన్యం

ఎక్కువసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రికార్డు మొరార్జీ దేశాయ్ పేరుపై ఉన్నది. ప్రధానులుగా నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి హయాంలలో ఆయన 10 సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2019లో కేంద్రంలో బీజేపీ వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మలను ఆర్థిక మంత్రిగా నియమించారు.

రైతుల సమస్యకు పరిష్కారం ఇచ్చేనా?

కొత్త బడ్జెట్‌లో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, పంటలకు కనీస మద్దతు ధరల సమస్యను పరిష్కరించే దిశగా కేంద్రం చర్యలు తీసుకుంటుందా? అని దేశ రైతులు ఎదురు చూస్తున్నారు. పంటలకు కనీస మద్దతు ధరలు పెంచాలని, ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించాలని రైతులు ఉద్యమాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రధాన పంటలకు కనీస మద్దతు ధరలు పెరగాలని రైతులు ఆశిస్తున్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి సాయం పెంపుపైనా ఆశలు పెట్టుకొన్నారు.

ఆదాయ పన్ను ఉపశమనం దక్కేనా?

మరోవైపు నిత్యావసరాలతో సహా అన్ని ధరలు పెరగడంతో గత కొన్నేండ్లుగా ప్రజల జీవన వ్యయాలు గణనీయంగా పెరిగాయి. అందుకు తగ్గట్టుగా వేతన జీవులకు ఆదాయ పన్ను విషయంలో ఉపశమనం మాత్రం దక్కడం లేదు. ఈసారైనా కేంద్రం ఊరటనిస్తుందా? అని ఉద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రూ.10 లక్షల లోపు ఆదాయమున్న మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులకు కొత్త బడ్జెట్‌లో కొంత ఉపశమనం ఉంటుందని అంచనాలు వినిపిస్తున్నాయి.

నీట్‌పై పార్లమెంట్‌లో రగడ

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై తొలిరోజే లోక్‌సభ దద్దరిల్లింది. అధికార, విపక్ష పార్టీల సభ్యుల మధ్య వాగ్యుద్ధం జరిగింది. నీట్ మాత్రమే కాదు.. దేశ మొత్తం పరీక్షా వ్యవస్థలోనే తీవ్రమైన సమస్య ఉన్నదని విపక్షాలు ఆరోపించాయి. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎలాంటి బాధ్యత తీసుకోవడం లేదని విమర్శించాయి. నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి. ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ లోక్‌సభలో మాట్లాడుతూ దేశంలోని మొత్తం పరీక్షా వ్యవస్థ మోసపూరితమని విద్యార్థులు భావిస్తున్నారని అన్నారు. విద్యా శాఖ మంత్రి ప్రధాన్ తనపై తప్ప ఇతరులపై నిందలు మోపుతున్నారని విమర్శించారు. ఈ వ్యవస్థాగత సమస్యను పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకొంటున్నారని ప్రశ్నించారు. దీనిపై ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ రాహుల్ గాంధీ, ఆయన పార్టీ మొసలి కన్నీరు కారుస్తున్నదని అన్నారు. గత ఏడేండ్లలో 70 పేపర్ లీకేజీ ఘటనలు జరిగాయన్న విపక్షాల ఆరోపణలపై మాట్లాడుతూ గత ఏడేండ్లలో పేపర్ లీకేజీలు జరిగినట్టు ఎలాంటి ఆధారాలు లేవని చెప్పుకొచ్చారు. సమాజ్‌వాదీ ఎంపీ అఖిలేశ్ మాట్లాడుతూ పేపర్ లీకేజీల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తున్నదని ఎద్దేవా చేశారు. అధిక సంఖ్యలో విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించిన పరీక్షా కేంద్రాల వివరాలను వెల్లడించాలన్నారు.

బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వలేం

- ఆ ప్రతిపాదనే మీ లేదన్న కేంద్రం
- మిత్రపక్ష జేడీయూకు గట్టి షాక్
- నితీశ్ రాజీనామాచేయాలి
- ప్రతిపక్ష ఆర్జేడీ డిమాండ్

న్యూఢిల్లీ: మిత్రపక్షం జేడీయూకి కేంద్రంలోని అధికార బీజేపీ గట్టి షాక్ ఇచ్చింది. బీహార్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే అంశంపై ప్రతిపాదనలు, ప్రణాళికలేమీ లేవని స్పష్టం చేసింది. ఆర్థిక వృద్ధి, పారిశ్రామికీకరణను ప్రోత్సహించేందుకు బీహార్, ఇతర వెనుకబడిన రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇచ్చే ప్రణాళిక ఏమైనా ఉందా? అని జేడీయూ ఎంపీ రామ్‌ప్రీత్ మండల్ అడిగిన ప్రశ్నకు ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభలో రాతపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్రం స్పందనపై ఆర్జేడీ మండిపడింది. జేడీయూను లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పించింది. 'కేంద్రంలో అధికారంలో భాగస్వామ్యమైన నితీశ్ కుమార్, ఇతర జేడీయూ నేతలు.. ఆ ఫలితాలను అనుభవించండి. బీహార్‌కు ప్రత్యేక హోదాపై వారి డ్రామా రాజకీయాలు కొనసాగించాలి' అర్జేడీ ఎక్స్ పోస్టులో ఎద్దేవా చేసింది. సీఎం నితీశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది.

కర్ణాటకలో ఈడీ అధికారులపై కేసు

బెంగళూరు, జూలై 22: కర్ణాటకలో 'వాల్మీకి' స్కామ్‌పై జరుగుతున్న దర్యాప్తు అనూహ్య మలుపు తీసుకుంది. స్కామ్‌ను దర్యాప్తు చేస్తున్న ఇద్దరు ఈడీ అధికారులకు వ్యతిరేకంగా బెంగళూరులోని విల్సన్ గార్డెన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఎం సిద్ధరామయ్య, మాజీ మంత్రి బీ నాగేంద్ర, ఆర్థిక శాఖల పేర్లు చెప్పాలంటూ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారిని ఈడీ అధికారులు ఒత్తిడి చేశారని ఆరోపిస్తూ ఈ కేసు నమోదైంది. కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో రూ.187 కోట్ల కుంభకోణంపై ఈడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. జూలై 16న సోషల్ వెల్ఫేర్ అదనపు డైరెక్టర్ కల్లేశ్‌ను కొన్ని గంటలపాటు ఈడీ ప్రశ్నించింది. ఈ సందర్భంగా సీఎం సిద్ధరామయ్య, మాజీ మంత్రి బీ నాగేంద్ర, ఆర్థిక శాఖల పేర్లు చెప్పాలంటూ ఈడీ అధికారులు తనను బెదిరించారని కల్లేశ్ బెంగళూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'ఎయిర్ బ్రీతింగ్ ప్రొపల్షన్ టెక్నాలజీ' ప్రయోగం సక్సెస్

- రెండోసారి విజయవంతంగా పరీక్షించిన ఇస్రో

బెంగళూరు, జూలై 22: 'ఎయిర్ బ్రీతింగ్ ప్రొపల్షన్ టెక్నాలజీ'ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరోసారి విజయవంతంగా పరీక్షించింది. శ్రీహరి కోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగించిన 'ఆర్‌హెచ్-560' రాకెట్‌లో ఇరువైపులా 'ప్రొపల్షన్ సిస్టం'ను అమర్చినట్టు ఇస్రో సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇంధనాన్ని మండించేందుకు కావాల్సిన ఆక్సిజన్‌ను వాతావరణంలో నుంచి రాకెట్ తీసుకోవటమే 'ఎయిర్ బ్రీతింగ్ ప్రొపల్షన్' టెక్నాలజీ. దీనివల్ల.. రాకెట్లు ప్రత్యేకంగా ఆక్సిజన్ సిలిండర్లను మోసుకెళ్లాల్సిన అవసరముండదు. ఎయిర్ బ్రీతింగ్ ప్రొపల్షన్‌తో ఆకాశంలోకి దూసుకెళ్లిన 'ఆర్‌హెచ్-560' రాకెట్ పనితీరును 110 రకాలుగా పరిశీలించినట్టు ఇస్రో తెలిపింది. రాకెట్ ధ్వని, ఇగ్నిషన్ వ్యవస్థల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసింది.

నీట్ రద్దుకు కర్ణాటక బిల్లు

బెంగళూరు: కర్ణాటకలో నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)ను రద్దు చేసేందుకు ఉద్దేశించిన బిల్లుకు రాష్ట్ర క్యాబినెట్ సోమవారం ఆమోదం తెలిపింది. నీట్‌కు బదులుగా వేరొక మెడికల్ ఎంట్రన్స్ టెస్ట్‌ను నిర్వహించాలని, లేదంటే, దీనిని రాష్ట్రంలోని కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌తో కలపాలని ఈ బిల్లు ప్రతిపాదించింది. పన్నెండో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా మెడికల్ అడ్మిషన్స్ కల్పించేందుకు రాష్ట్రాలకు అవకాశం ఇవ్వాలని కోరింది. నీట్-యూజీ 2024 పరీక్షల్లో పేపర్ లీక్, తదితర అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలోని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ బిల్లును శాసన సభలో ప్రవేశపెడతారు.

ఆ ప్రశ్నకు సరైన సమాధానం తేల్చండి

- నీట్‌లో వివాదాస్పద ప్రశ్నపై ఢిల్లీ ఐఐటీని కోరిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జూలై 22: నీట్ యూజీ-2024లో అడిగిన ఓ ప్రశ్నకు సరైన సమాధానాన్ని తేల్చాలని సుప్రీంకోర్టు సోమవారం ఢిల్లీ ఐఐటీ డైరెక్టర్‌ను కోరింది. ఇందు కోసం ముగ్గురు నిపుణులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలని, సరైన సమాధానంపై మంగళవారం మధ్యాహ్నంలోగా నివేదిక ఇవ్వాలని సూచించింది. నీట్ యూజీ పరీక్షలో 'అణువు' దాని లక్షణాలకు సంబంధించి అడిగిన ప్రశ్నకు ఇచ్చిన ఆప్షన్లలో రెండు సరైన సమాధానాలు ఉన్నాయని, ఆ రెండింటిలో ఒక నిర్దిష్ట సమాధానం ఇచ్చిన వాళ్లకే నాలుగు మార్కులు ఇచ్చారంటూ పలువురు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. ఇది తుది

మెరిట్ జాబితాపై తీవ్ర ప్రభావం చూపిందని సీజేఐ ధర్మాసనానికి తెలిపారు. అంతకు ముందు నీట్ యూజీ-2024 పరీక్షను రద్దు చేయాలన్న పిటిషన్లపై విచారణ జరిపిన ధర్మాసనం.. పరీక్ష నిర్వహణలో వ్యవస్థాగత వైఫల్యం జరిగిందనే దానికి, దేశవ్యాప్తంగా విస్తృతంగా పేపర్ లీకేజీ అయిందనే దానికి తగిన డాటా చూపించాలని పిటిషన్‌దారులకు సూచించింది. విస్తృతంగా లీకేజీ అయిందన్న దానికి ఆధారాలు లేవని, కేవలం పాట్నా, హజారీబాగ్ వంటి చోట్ల మాత్రమే అక్రమాలు జరిగాయని తెలిపింది.

ఎన్‌టీఏ ఏర్పడ్డ తర్వాత 16 పరీక్షలు వాయిదా

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఏర్పాటైన నాటి (2018లో) నుంచి ఇప్పటివరకు వివిధ కారణాలతో 16 పరీక్షలు వాయిదా పడ్డాయని, ఆ సంస్థ 240 పరీక్షల్ని విజయవంతంగా నిర్వహించిందని లోక్‌సభలో కేంద్రం వెల్లడించింది. కొవిడ్-19 సంక్షోభం, సాంకేతిక, పాలనాపరమైన సమస్యలు, పరీక్ష పేపర్ రవాణాలో ఆటంకాలు తదితర కారణాలతో పరీక్షలు వాయిదా పడ్డాయని కేంద్ర సహాయమంత్రి సుకాంత మజుందార్ సోమవారం పార్లమెంట్‌లో వెల్లడించారు.



ఆటో డ్రైవర్‌గా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్!

బెంగళూరు: నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఒకరికొకరు మాట్లాడుకోవడమే గగనంగా మారింది. ఉన్నత చదువులు చదివి, నగరాల్లో ఉద్యోగాలు చేస్తూ, కుటుంబ సభ్యులకు దూరంగా ఉండేవారు ఒంటరితనంతో సతమతమవుతున్నారు. నలుగురితో కలివిడిగా మాట్లాడాలన్న కోరికతో ఇటువంటివారు రకరకాల వ్యాపకాలు చేసుకుంటున్నారు. తాజాగా ఓ నెటిజన్ ఇటువంటి సంఘటనను వెలుగులోకి తీసుకొచ్చారు. కోరమంగళలో తాను ఓ ఆటోను బుక్ చేసుకున్నానని, ఆ ఆటో డ్రైవర్ మైక్రోసాఫ్ట్ లోగో ఉన్న హుడీని ధరించడంతో ఆశ్చర్యపోయానని చెప్పారు. ఆయనతో మాటలు కలిపినపుడు తాను మైక్రోసాఫ్ట్ ఇంజినీర్‌నని, ఒంటరితనాన్ని భరించలేక, నలుగురితో మాట్లాడే అవకాశం కోసం వారాంతాల్లో ఆటో నడుపుతున్నట్లు చెప్పారని తెలిపారు. గతంలో ఓ మహిళ ఇచ్చిన పోస్ట్‌లో, తాను బుక్ చేసుకున్న ర్యాపిడో డ్రైవర్ ఓ ప్రముఖ కార్పొరేట్ సంస్థలో మేనేజర్ అని తెలుసుకుని ఆశ్చర్యపోయానని చెప్పిన సంగతి తెలిసిందే. బెంగళూరు నగరంలో ఇటీవల ఇటువంటి సంఘటనలు తరచూ కనిపిస్తున్నాయి.

ఆ ఇద్దరు ఎమ్మెల్యేలపై గవర్నర్ జరిమానా రూ.500

- బెంగాల్‌లో కొనసాగుతున్న 'ప్రమాణ స్వీకార' రగడ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో ఉపఎన్నికల్లో గెలిచిన ఇద్దరు టీఎంసీ ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారంపై రగడ కొనసాగుతున్నది. స్పీకర్ వారి చేత ప్రమాణం చేయించడం, తాజాగా సోమవారం నుంచి ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ రాజ్‌భవన్ ఆ ఇద్దరు శాసనసభ్యులపై రూ.500 చొప్పున జరిమానా విధించింది. ఈ మేరకు గవర్నర్ సీవీ ఆనంద బోస్ కార్యాలయం నుంచి తమకు మెయిల్స్ వచ్చాయని ఎమ్మెల్యేలు హుస్సేన్ సర్కార్, శయంతికా బెనర్జీ సోమవారం వెల్లడించారు. ప్రమాణ స్వీకార ప్రక్రియ చట్టబద్ధతను ప్రశ్నించిన రాజ్‌భవన్.. రూ.500 జరిమానా చెల్లించాలని ఆదేశించిందని పేర్కొన్నారు. ఈనెల 5న ఇద్దరు ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకార ప్రక్రియను గవర్నర్ డిప్యూటీ స్పీకర్ అశిష్ బెనర్జీకి అప్పగించగా.. వారిద్దరి చేత స్పీకర్ బిమన్ బెనర్జీ ప్రమాణం చేయించారు. దీనిపై తాము స్పీకర్‌ను కలిశామని శయంతికా బెనర్జీ తెలిపారు. ఈ అంశాన్ని స్పీకర్ కార్యాలయం చూసుకుంటుందని ఆయన చెప్పారని పేర్కొన్నారు. తాము జరిమానా చెల్లించేది లేదని స్పష్టం చేశారు.

పెండ్లి అయిన మూడు నిమిషాల్లోనే విడాకులు

న్యూఢిల్లీ: కువైట్‌లో నవ దంపతులు రికార్డు సృష్టించారు. వీరిద్దరూ భార్యాభర్తలు అని కోర్టులో జడ్జి ప్రకటించిన మూడు నిమిషాల్లోనే విడాకులు తీసుకున్నారు. 2019లో జరిగిన ఈ వివాహం, విడాకులు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మీడియా కథనాల ప్రకారం, యువతి, యువకుడు కోర్టులో వివాహ రిజిస్ట్రేషన్ కోసం వెళ్లారు. జడ్జి నిబంధనల ప్రకారం ఆ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. వీరిద్దరూ భార్యాభర్తలని ప్రకటించారు. అనంతరం ఇరువురు కలిసి కోర్టు నుంచి బయటకు వెళ్తుండగా, యువతి కాలు జారి పడిపోయింది. ఆ యువకుడు ఆమెను 'స్టుపిడ్' అన్నాడు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన యువతి వెంటనే జడ్జి వద్దకు వెళ్లి, తమ వివాహాన్ని తక్షణమే రద్దు చేయాలని కోరింది. జడ్జి అందుకు అంగీకరించి, వీరి వివాహాన్ని రద్దు చేశారు.

మంత్రి అల్లుడి కోసం కొత్త పోస్టు!

- కర్ణాటక అసెంబ్లీలో 'సెక్రటరీ-2' సృష్టి
- ఆర్థిక విభాగం ఆమోదానికి స్పీకర్ లేఖ
- కాంగ్రెస్ ప్రభుత్వంపై విపక్షాల ధ్వజం

బెంగళూరు: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో మంత్రి కేహెచ్ మునియప్ప అల్లుడి కోసం అసెంబ్లీలో ఒక కొత్త పోస్టును సృష్టించడం రాజకీయ దుమారం రేపింది. విధానసభలో 'అసెంబ్లీ కార్యదర్శి' అనే ఒక పోస్టు ఇప్పటికే ఉండగా.. దానికి అదనంగా 'సెక్రటరీ-2' అనే పోస్టును సృష్టించి, దాన్ని అమాత్యుడి అల్లుడికి కేటాయించేందుకు ప్రభుత్వం పావులు కదపడంపై విపక్ష పార్టీలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. కొత్త పోస్టు సృష్టికి సంబంధించి అసెంబ్లీ స్పీకర్ అసెంబ్లీ ఆర్థిక విభాగానికి లేఖ రాసిన నేపథ్యంలో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మంత్రి కేహెచ్ మునియప్ప అల్లుడు శశిధర్ కోసం ఈ కొత్త పోస్టును ఏర్పాటు జరిగినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

మునియప్ప

సెక్రటరీ అవకాశం లేకపోవడంతో.. కొత్త పోస్టును సృష్టించడాన్ని కర్ణాటక విధాన సభ ఉద్యోగుల సంఘం వ్యతిరేకించింది. శశిధర్‌కు సెక్రటరీ పోస్టు వచ్చే అవకాశం లేకపోవడంతోనే 'సెక్రటరీ-2' అనే పోస్టును ఏర్పాటు చేయించారని అసెంబ్లీ కార్యదర్శికి రాసిన లేఖలో పేర్కొన్నది. మరో వైపు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై బీజేపీ మండిపడింది. ఎమ్మెల్యేల తిరుగుబాటు ప్రయత్నాలను చల్లార్చేందుకు రాజ్యాంగ నిబంధనలు ఉల్లంఘిస్తూ 90 క్యాబినెట్ గ్రేడ్ స్థాయి హోదాలను ఏర్పాటు చేశారని, ఇప్పుడు మంత్రి అల్లుడి కోసం కొత్త పోస్టును సృష్టించారని అసెంబ్లీలో బీజేపీ పక్ష నేత ఆర్ అశోక్ విమర్శించారు.

ఆగస్టు 1న బీజేపీ దిష్టిబొమ్మల దహనం

15న దేశవ్యాప్తంగా ట్రాక్టర్ ర్యాలీ ● ఎస్కేఎం(నాన్ పాలిటికల్), కేఎంఎం

న్యూఢిల్లీ: రైతు డిమాండ్లు నెరవేర్చాలంటూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం-నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) దేశవ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చాయి. దేశవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో ఆగస్టు 1న బీజేపీ దిష్టిబొమ్మలు దగ్ధం చేస్తామని, ఆగస్టు 15న ట్రాక్టర్ ర్యాలీ చేపడతామని ప్రకటించాయి. ఈ ఆందోళనల్లో రైతులు, రైతు కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరాయి. ఈ మేరకు సోమవారం సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. న్యూఢిల్లీలో కేఎంఎం నాయకుడు సర్వన్ సింగ్ విలేకరులతో మాట్లాడుతూ, 'రైతులు చేపట్టిన 'ఢిల్లీ చలో' మార్చ్ ఆగస్టు 31నాటికి 200 రోజులు పూర్తిచేసుకుంటుంది. ఖానౌరి, శంభు వద్దకు రావాల్సిందిగా రైతులందర్నీ కోరుతున్నాం' అని చెప్పారు.

ప్రభుత్వ ఉద్యోగులు ఆరెస్సెస్ కార్యక్రమాల్లో పాల్గొనొచ్చు

- నిషేధం ఎత్తివేసిన కేంద్రం

న్యూఢిల్లీ, జూలై 22: రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆరెస్సెస్) కార్యక్రమాల్లో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనటంపై ఉన్న నిషేధాన్ని కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఎత్తివేసింది. 58 ఏండ్లుగా కొనసాగుతున్న ఈ నిషేధానికి స్వస్తి పలుకుతూ ఆదేశాలు జారీ చేసింది. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో గాంధీ హత్య సహా పలు కారణాలతో ఆరెస్సెస్ నిషేధాన్ని ఎదుర్కొన్నది. దీంతో అప్పటి ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులు ఆరెస్సెస్‌లో చేరటాన్ని నిషేధించింది. దాన్ని ఇప్పుడు కేంద్రం ఎత్తివేసింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఆరెస్సెస్, బీజేపీ స్వాగతించాయి. ఈ నిర్ణయంతో ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత పటిష్టం అవుతుందని ఆరెస్సెస్ వ్యాఖ్యానించింది. కాగా, నిషేధం ఎత్తివేతపై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో మండిపడింది.

అగ్నిపథ్ స్కీమ్‌లో స్కామ్!

- అగ్నివీర్ నియామకాల్లో అక్రమాలు
- కటాఫ్ కంటే తక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థులు ఎంపిక
- హైకోర్టుకు పలువురు అభ్యర్థులు
- అభ్యర్థులందరి మార్కుల వివరాలు వెల్లడించాలని ఆర్మీకి ఆదేశం
- 'బి వైర్'లో సంచలన కథనం

గ్వాలియర్: దేశంలో ఇప్పటికే నీట్, నెట్ పేపర్ లీక్‌లపై తీవ్ర దుమారం రేగుతున్న వేళ.. సాయుధ బలగాల్లో నియామకాల కోసం కేంద్రం తీసుకొచ్చిన అగ్నిపథ పథకంలోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2022, సెప్టెంబర్-నవంబర్‌లో మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో నిర్వహించిన అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ పరీక్షలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వస్తున్నాయి. కటాఫ్ కంటే తక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థుల పేర్లు మెరిట్ జాబితాలో కనిపించాయని కొంత మంది అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో రిక్రూట్‌మెంట్ ర్యాలీ సందర్భంగా ఎంపిక చేసిన అభ్యర్థులందరి మార్కుల వివరాలు వెల్లడించాలని మధ్యప్రదేశ్ హైకోర్టు ఇటీవల ఆర్మీకి ఆదేశాలు జారీచేసింది. ఈ మొత్తం వ్యవహారంపై ఇన్వెస్టిగేషన్ చేసిన 'ది వైర్' తాజా కథనంలో కీలక విషయాలను వెల్లడించింది.

10 మార్కులు తక్కువ వచ్చినా సెలెక్ట్

ఫలితాలపై తీరుపై పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు వేశారు. తమకు వచ్చిన మార్కులు, కటాఫ్ స్కోర్, ఇతర అభ్యర్థులకు వచ్చిన మార్కుల వివరాలు తెలియజేయాలని కోరుతూ ఆర్మీకి ఆర్టీఐ కింద దరఖాస్తు చేశారు. 169గా నిర్ణయించిన కటాఫ్ కంటే తక్కువ స్కోర్ 159 వచ్చిన నితీశ్ కుమార్ అనే అభ్యర్థి పేరు ఎంపికైన వారి జాబితాలో కనిపించింది. ఆర్మీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన సెలెక్ట్ అయిన అభ్యర్థుల లిస్టులో అతని రోల్ నంబర్ కనిపించింది. పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో నితీశ్ కుమార్ పేరును లిస్టు నుంచి తర్వాత తొలగించారని పేర్కొన్నారు.

ఊబకాయంపై వర్రీ

- దేశంలో ఒబెసిటీ సమస్య
- 54 శాతం వ్యాధుల భారానికి అనారోగ్యకర ఆహారమే కారణం
- ఆర్థిక సర్వే 2023-24లో వెల్లడి

న్యూఢిల్లీ: మన దేశంలో మొత్తం వ్యాధుల భారంలో 54 శాతానికి కారణం అనారోగ్యకర ఆహారమేనని ఆర్థిక సర్వే 2023-24 తెలిపింది. దేశంలో పెరుగుతున్న ఊబకాయ సమస్యపై ఆందోళన వ్యక్తం చేసింది. కొవ్వు, చక్కెరలతో ప్రాసెస్డ్ ఫుడ్ వినియోగం విపరీతంగా పెరగడంపై అప్రమత్తత అవసరమని పేర్కొన్నది. ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవాటు చేసుకునేలా ప్రజలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని చెప్పింది. మన దేశ వయోజనుల్లో ఇది తీవ్ర సమస్యగా పరిణమిస్తున్నదని హెచ్చరించింది. పని చేయగలిగే సామర్థ్యం గల జనాభా వల్ల సత్ఫలితాలను సాధించాలంటే, ప్రజలు సమతుల, వైవిధ్య భరితమైన ఆహారాన్ని తీసుకోవడం ముఖ్యమని ఈ నివేదిక స్పష్టం చేసింది. భారత వైద్య పరిశోధన మండలి నివేదికను ఉటంకిస్తూ, కొవ్వు, చక్కెరలతో కూడిన హైలీ ప్రాసెస్డ్ ఫుడ్స్ వినియోగం పెరుగుతుండటం, దానితోపాటు శారీరక శ్రమ తగ్గిపోవడం ఊబకాయం సమస్యలకు దారితీస్తున్నట్లు వివరించింది.

పట్టణాల్లోనే అధికం

మన దేశంలో వయోజనుల్లో ఊబకాయం రేటు మూడు రెట్లు కన్నా ఎక్కువకు పెరిగిందని నివేదిక తెలిపింది. జాతీయ కుటుంబ ఆరోగ